# భారతదేశ చరిత్ర

## 1857 సిపాయిల తిరుగుబాటు

ఆధునిక భారతదేశ చరిత్రలో 1857 తిరుగుబాటు ఒక ముఖ్యమైన చారిత్రక ఘట్టం. ఈ తిరుగుబాటుకు దారితీసిన పరిస్థితులను రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత, సైనిక కారణాలుగా విభజించవచ్చు.

### రాజకీయ కారణాలు

భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడానికి ఆంగ్లేయులు అనేక పద్ధతులు అనుసరించారు. యుద్ధాలు, సైన్య సహకార పద్ధతి, పరిపాలన సరిగా లేదనే నెపంతో సామ్రాజ్యాన్ని విస్తరించారు. డల్హౌసీ మరో అడుగు ముందుకువేసి రాజ్యసంక్రమణం సిద్ధాంతం ద్వారా అయోధ్య, సతారా, నాగ్‌పూర్, ఝూన్సీ లాంటి సంస్థానాలను బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. పీష్వా దత్తకుమారుడైన నానాసాహెబ్‌కు భరణాన్ని నిరాకరించాడు. కర్ణాటక, తంజావూర్, తిరువాన్కూర్ రాజుల బిరుదులు రద్దు చేశాడు. మొగలు చక్రవర్తి నివాసాన్ని ఎర్రకోట నుంచి కుతుబ్‌మీనార్‌కు దగ్గరగా మార్చాలని, బహదూర్ షా తర్వాత మొగల్ చక్రవర్తి బిరుదును రద్దు చేయాలని ప్రతిపాదించాడు. దీంతో స్వదేశీ రాజుల్లో భవిష్యత్తు గురించి ఆందోళన మొదలైంది. ఆంగ్లేయుల జాతి వివక్ష, వారు తమ పట్ల చూపిన నిరాదరణ ప్రజల్లో అసంతృప్తి కలిగించింది. ఇలాంటి వారంతా 1857 తిరుగుబాటులో పాల్గొన్నారు.

### ఆర్థిక కారణాలు

రాజ్య సంక్రమణ సిద్ధాంతం వల్ల అనేక రాజ్యాలు బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమై ఆయా రాజ్యాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, గాయకులు, కవులు, విద్వాంసులు నిరుద్యోగులై సిపాయిలుగా మారారు. వీరంతా పని లేక, తినడానికి తిండి లేక అలమటించారు. కంపెనీ ప్రభుత్వం భారతదేశంలో వ్యవసాయాన్ని, పరిశ్రమలను నిర్లక్ష్యం చేసింది. కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. క్షీణించిన ఆర్థిక పరిస్థితి తిరుగుబాటుకు పురికొల్పింది.

### సాంఘిక కారణాలు

1829లో విలియం బెంటింక్ సతీసహగమనం నిషేధ చట్టం చేశాడు. లార్డ్ డల్హౌసీ 1856లో వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. 1856లో మతం మార్చుకున్న వారికి ఆస్తి హక్కులను పరిరక్షిస్తూ భారతీయ వారసత్వ చట్టం వచ్చింది. బాల్యవివాహాల నిషేధ చట్టం లాంటి సంస్కరణలు తమ సనాతన ధర్మానికి విరుద్ధమని హిందువులు అభిప్రాయపడ్డారు. 1853లో లార్డ్ డల్హౌసీ రైల్వే, తంతి తపాల లాంటి ఆధునికీకరణ విధానాలు ప్రజల్లో సంచలనాన్ని సృష్టించాయి. తమ ఆచారబద్ధమైన జీవన విధానాన్ని నాశనం చేయడానికి బ్రిటిష్‌వారు ఈ ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టారని కొందరు భావించారు. ప్రభుత్వం చట్టాల ద్వారా తమ మతధర్మాలను నాశనం చేస్తోందని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది.

### మత కారణాలు

క్రైస్తవులైన ఆంగ్లేయులు హిందువులందరినీ క్రైస్తవ మతంలోకి మారుస్తారనే అనుమానం ప్రజల్లో ఏర్పడింది. క్రైస్తవ మిషనరీలు తమ మత ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. 1853 ఛార్టర్ చట్టంలో క్రైస్తవ మిషనరీలకు సౌకర్యాలు కల్పించటం, ఇంగ్లిష్ విద్యావ్యాప్తికి నిధులను కేటాయించడం లాంటివి ప్రజల్లో ఆందోళన కలిగించాయి. మత మార్పిడులను ప్రోత్సహించి భారతదేశాన్ని క్రైస్తవ రాజ్యంగా మార్చడానికి బ్రిటిష్‌వారు ప్రయత్నిస్తున్నారనే భావన భారతీయుల్లో ఏర్పడింది. దీంతో ప్రజలు కంపెనీ పాలన పట్ల వ్యతిరేకతను ప్రదర్శించారు.

### సైనిక కారణాలు

ఈస్టిండియా కంపెనీలో రెండు రకాల సైనికులున్నారు. బతుకు తెరువు కోసం కంపెనీలో సైనిక ఉద్యోగులుగా చేరిన భారతీయులను సిపాయిలు అని పిలిచేవారు. ఆంగ్లేయులను సైనికులుగా పిలిచేవారు. వీరిద్దరి మధ్య హోదాలు, జీతభత్యాల్లో చాలా తేడా ఉండేది. సిపాయి, సైనికుల నిష్పత్తి 4 : 1 గా ఉండేది. 1856లో లార్డ్ కానింగ్ సామాన్య సేవా నియుక్త చట్టం (జనరల్ సర్వీసెస్ ఎన్‌లిస్ట్‌మెంట్ యాక్ట్) ప్రవేశపెట్టి సిపాయిలు ఏ ప్రాంతానికైనా వెళ్లి యుద్ధం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం సముద్ర ప్రయాణం నిషేధం. కులం, మతాన్ని సూచించే చిహ్నాలను తీసివేయాలనే ఉత్తర్వులు సిపాయిలను మరింత భయాందోళనకు గురిచేశాయి.

- ✪ కొన్నేళ్లుగా తీవ్ర అసంతృప్తికి లోనైన సిపాయిలు 1849, 1850, 1852 లో తమ నిరసనలను తిరుగుబాట్ల రూపంలో ప్రదర్శించారు. 1857 నాటికి ఈ అసంతృప్తి తారస్థాయికి చేరుకుంది.
- ✪ మొదటి అఫ్గన్ యుద్ధంలో, సిక్కు యుద్ధాల్లో ఆంగ్లేయులకు సంభవించిన ఓటమి చూసి వారు అజేయులు అనే భావం పోయింది. కలిసి పోరాడితే ఆంగ్లేయులను ఓడించడం కష్టమేమీ కాదని సిపాయిలు భావించారు.

### తక్షణ కారణం

ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం 1856 లో ఎన్‌ఫీల్డ్ తుపాకులను ప్రవేశపెట్టింది. వీటిలో ఉపయోగించే తూటాల చివరి భాగాన్ని సైనికులు నోటితో కొరికి తుపాకిలో అమర్చాల్సి ఉండేది. ఆ తూటాలకు ఆవు, పంది కొవ్వు పూసినట్లు ప్రచారం జరిగింది. ఆవు హిందువులకు పవిత్రమైంది. ముస్లింలు పందిని అపవిత్రంగా భావిస్తారు. దీంతో ఆంగ్లేయులు తమ మతాలను బుద్ధిపూర్వకంగా కించపరచడానికే ఈ పని చేశారని సిపాయిలు విశ్వసించారు.

### తిరుగుబాటు ప్రారంభం

1857 ఫిబ్రవరి 26న బరాక్‌పూర్‌లోని 19వ పటాలం సైనిక కవాతులో పాల్గొనలేదు. 1857 మార్చి 29న బారక్‌పూర్‌లోని 34వ పటాలానికి చెందిన మంగళ్ పాండే అనే సిపాయి తూటాలను వాడటానికి నిరాకరించాడు. లెఫ్టినెంట్ బాగ్ అనే ఆంగ్లేయ సైనిక అధికారిని కాల్చిచంపాడు. దీంతో మంగళ్ పాండేని ఉరితీశారు. సిపాయిలు కొత్త రకం తూటాలను ఉపయోగించడానికి నిరాకరించడంతో అధికారులు వారందరినీ శిక్షించారు. ఆరుగురిని సైనిక న్యాయస్థానంలో విచారించి 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు.

- ✪ 1857 మే 10న మీరట్‌లో సిపాయిల తిరుగుబాటు ప్రారంభమైంది. ఆనాటి బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ లార్డ్ కానింగ్. సిపాయిలు ఢిల్లీ చేరుకుని చివరి మొగల్ చక్రవర్తి రెండో బహదూర్ షాను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. సిపాయిలు వీరోచితంగా పోరాడినా తిరుగుబాటు విఫలమైంది.

**తిరుగుబాటు కాలంలో వివిధ ప్రాంతాలనుంచి సిపాయిలకు మద్దతుగా తమ హక్కులు, వారసత్వం కోసం పోరాడినవారు:**

| ప్రదేశం | నాయకత్వం | బ్రిటిష్ సేనాని |
|---|---|---|
| ఢిల్లీ | భక్త్‌ఖాన్ | నికోల్‌సన్ |
| కాన్పూర్, లఖ్‌నవూ | నానాసాహెబ్ | హేవ్‌లాక్, క్యాంప్‌బెల్ |
| లఖ్‌నవూ | హజ్రత్ మహల్ | హేవ్‌లాక్, క్యాంప్‌బెల్ |
| గ్వాలియర్ | తాంతియా తోపే | విండ్‌హామ్ |
| ఝాన్సీ | లక్ష్మీబాయి | సర్ హ్యూరోజ్ |
| బరేలి | ఖాన్ బహదూర్‌ఖాన్ | క్యాంప్‌బెల్ |
| బిహార్ | కున్వర్‌సింగ్ | విలియం టేలర్ |
| ఫైజాబాద్ | మౌల్వీ అహ్మదుల్లా | విలియం టేలర్ |

### ముఖ్యమైన ప్రశ్నలు

**1.** డల్హౌసీ ప్రవేశ పెట్టిన విధానం ఏది?

1) శాశ్వత శిస్తు విధానం　2) రాజ్యసంక్రమణ విధానం
3) ఆంగ్ల విద్యా విధానం　4) సైన్య సహకార ఒప్పందం

**2.** 1856లో సామాన్య సేవా నియుక్త చట్టం చేసింది ఎవరు?

1) డల్హౌసీ　2) కానింగ్　3) కర్జన్　4) రిప్పన్

**3.** ఝాన్సీ లక్ష్మీబాయిని ఓడించిన ఆంగ్లేయ సేనాని ఎవరు?

1) క్యాంప్‌బెల్　2) హేవ్‌లాక్　3) టేలర్　4) సర్ హ్యూరోజ్

4. మొదటి భారత రాజ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టింది ఎవరు?

1) డల్హౌసీ 2) ఛార్లెస్ ఉడ్ 3) కానింగ్ 4) రిప్పన్

5. నానాసాహెబ్ అసలు పేరేంటి?

1) దోండుపంత్ 2) గులాబ్‌సింగ్ 3) గధాధర్ 4) నరేంద్రనాథ్

6. భారతదేశంలో మొదటి వైస్రాయిగా నియమితుడైన వ్యక్తి?

1) డల్హౌసీ 2) కర్జన్ 3) ఉడ్ 4) కానింగ్

7. 1857 తిరుగుబాటుకు కారణం/ కారణాలు...?

1) రాజ్య సంక్రమణ సిద్ధాంతం 2) ఆంగ్లేయుల భూమి శిస్తు విధానం

3) ఆంగ్లేయుల ఆర్థిక విధానాలు 4) అన్నీ

8. క్రైస్తవ మిషనరీలను భారతదేశంలోకి ఎప్పుడు అనుమతించారు?

1) 1813 2) 1833 3) 1853 4) 1793

9. 1857 తిరుగుబాటుకు తక్షణ కారణం ఏది?

1) దత్తపుత్ర విధానం 2) సైన్య సహకార ఒప్పందాలు

3) శాశ్వత శిస్తు విధానాలు 4) ఎన్‌ఫీల్డ్ తుపాకులు

10. 1857 తిరుగుబాటు సమయంలో తిరుగుబాటు చేసిన మొదటి వ్యక్తి?

1) బహదూర్‌షా 2) కున్వర్‌సింగ్ 3) మంగళ్‌పాండే 4) బిర్జిస్ ఖాద్రి

11. 1857 తిరుగుబాటు ఎక్కడ మొదలైంది?

1) దిల్లీ 2) అయోధ్య 3) మీరట్ 4) బిహార్

12. 1857 తిరుగుబాటు ఎప్పుడు ప్రారంభమైంది?

1) 1857 జనవరి 10 2) 1857 మార్చి 10 3) 1857 మే 10 4) 1857 ఫిబ్రవరి 10

13. 1858లో భారతదేశ పరిపాలనను స్వీకరించిన బ్రిటిష్ రాణి?

1) మొదటి ఎలిజబెత్ 2) రెండో ఎలిజబెత్ 3) మొదటి విక్టోరియా 4) రెండో విక్టోరియా

14. రెండో బహదూర్ షా ఎప్పుడు మరణించాడు?

1) 1858 2) 1862 3) 1857 4) 1865

15. 1856లో వితంతు పునర్వివాహ చట్టం తీసుకు వచ్చింది ఎవరు?

1) లార్డ్ డల్హౌసీ 2) లార్డ్ కానింగ్ 3) లార్డ్ కర్జన్ 4) విలియం బెంటింక్

16. 1857 తిరుగుబాటు ప్రధాన ఫలితం ఏది?

1) ఈస్టిండియా కంపెనీ పాలన రద్దు 2) బ్రిటిష్ ప్రభుత్వం భారతపాలన చేపట్టింది

3) భారతీయులపట్ల బ్రిటిష్ విధానాలు, దృక్పథాలు మారాయి 4) అన్నీ

**జవాబులు**

1-2; 2-2; 3-4; 4-2; 5-1; 6-4; 7-4; 8-1; 9-4; 10-3; 11-3; 12-3; 13-3; 14-2; 15-1; 16-4.

**రచయిత: అమరనేని కృష్ణ**